క్లుప్తంగా

లక్ష్మీతిరుపతమ్మ తల్లి జ్యోతి ఊరేగింపు



నగర పంచాయతీ పురవీధుల్లో అమ్మవారి జ్యోతిని ఊరేగిస్తున్న దృశ్యం

దాచేపల్లి: నగర పంచాయతీ పురవీధుల్లో లక్ష్మీ తిరుపతమ్మ తల్లి జ్యోతి ఊరేగింపు కార్యక్రమం గురువారం చేపట్టారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై లక్ష్మీతిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి ఉత్సవ విగ్రహాలు అలంకరించారు. అనంతరం అమ్మవారి జ్యోతి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. నగర పంచాయతీ పురవీధుల్లో జ్యోతిని ఊరేగిస్తుండగా భక్తులు ప్రత్యేకంగా పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గురుస్వాములు కోర్రపాటి ఏర్రయ్య, మస్తాన్, రామారావు, అన్నం సైదారావు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

మాచర్ల: పట్టణంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) స్టేషన్ పరిధిలో ఈనెల 21న సీజ్ చేసిన వాహనాలకు వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఈబీ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ రెడ్డి గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈవాహనాలను బహిరంగ వేలంలో విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు. ద్విచక్రవాహనాలు, వాహనాలు వేలంలో పాల్గొని కొనుగోలు చేయవచ్చన్నారు. మాచర్లలోని పీడబ్ల్యూ కాలనీలోని ఎక్సైజ్ పోలీసు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

బోరు మరమ్మతుల పరిశీలన



మరమ్మతులను పరిశీలిస్తున్న చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కమిషనర్ రమణబాబు

మాచర్ల: పట్టణంలోని నెహ్రూనగర్ 2వలైనులో మరమ్మతులకు గురైన విద్యుత్‌బోర్‌ను మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కమిషనర్ రమణబాబులు గురువారం పరిశీలించి మరమ్మతులు చేయించారు. వార్డు కౌన్సిలర్ రామిశెట్టి వెంకటేశ్వర్లు బోరు మరమ్మతుకు గురైన విషయాన్ని మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే చైర్మన్, కమిషనర్ వార్డుకు వెళ్లి దగ్గరుండి బోరు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు కోటిరెడ్డి, రామాంజరెడ్డి, బాలస్వామిరెడ్డి, పురపాలక సంఘ అధికారులు పాల్గొన్నారు.

వరిలో నీటి యాజమాన్యం కీలకం



నకరికల్లు: రబీలో వరి నాట్లు వేసేందుకు చదరపు మీటరుకు 44 కుదుళ్లు ఉండేవిధంగా చూసుకోవాలని పల్నాడు జిల్లా బీఆర్సీ డీడీఏ శివకుమారి తెలిపారు. మండలంలోని నర్సింగపాడు గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వేస్తున్న వరి నాట్లను పరిశీలించారు. నీటి యాజమాన్యం గురించి వివరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు, వ్యవసాయ అధికారి కె.దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

రాజుపాలెం: యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అనుపాలెంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆరుద్ర తిరుపతిరావు(35) ఇంటిలో ఎవ్వరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పనికి వెళ్లి వచ్చే సరికే ఫ్యాన్‌కు వేలాడుతూ ఉండడంతో చూసి నిర్ఘాంతపోయి, కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్నవారు వచ్చి కిందకు దించారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి బాబు, పాప ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎస్‌కే షఫీ, ఏఎస్ఐ పుల్లారావు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొప్పూడి గ్రామానికి చెందిన పూసల వెంకటేశ్వర్లు (58) వ్యక్తిగత పనిమీద స్కూటీపై పట్టణానికి వచ్చి, తిరుగు ప్రయాణమయ్యాడు. జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో వెళుతున్న సమయంలో ఓ ప్రైవేటు ఆసుపత్రి సమీపంలో ఎదురుగా వచ్చిన పల్సర్ వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందగా, పల్సర్ వ్యక్తికి గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు పూసల సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగి వేమన జీవితం అందరికీ ఆదర్శం



పిడుగురాళ్లలో యోగి వేమన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ అంజిరెడ్డి



వేమన చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు టి.చిన్న ఆంజనేయులు రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

పిడుగురాళ్ల: భావితరాలు ఆదర్శంగా తీసుకోవాల్సిన వ్యక్తి యోగి వేమన అని డాక్టర్ లోకిరెడ్డి అంజిరెడ్డి అన్నారు. పట్టణంలోని అంజిరెడ్డి హాస్పటల్ ఎదురుగా దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద యోగి వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంజిరెడ్డి మాట్లాడుతూ తన పద్యాలతో ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన వ్యక్తి యోగి వేమన అన్నారు. అంతేకాకుండా ఎంతోమంది కవులకు ఆయన పద్యాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. నీతి పద్యాలను ఇప్పటికి మన పిల్లలకుకూడా నేర్పిస్తున్నామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరభద్రుని రామిరెడ్డి, చల్లా పిచ్చిరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ చింతా సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు కత్తెరపు వాసుదేవరెడ్డి, గుర్రం అప్పిరెడ్డి, గంగాయమ్మ, ముత్తారెడ్డి, రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వెన్నా శ్రీనివాస్‌రెడ్డి, పాశం వెంకటరెడ్డి, ది కొండవీటి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

సంఘసంస్కర్త యోగి వేమన...

పిడుగురాళ్లరూరల్: సామాజిక చైతన్య స్ఫూర్తి ప్రధాత, అభ్యుదయ పద్యరచన సంఘసంస్కర్త యోగి వేమన అని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి అన్నారు. మండలంలోని పందిటివారిపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం యోగివేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తాటికొండ చిన్న ఆంజనేయులు రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అర్థమయ్యే రీతిలో వేమన పద్యాలను ఆలపించారని, అలాంటి మహనీయుడు జయంతి జరుపుకోవటం ఎంతో ఆనందకరమన్నారు. తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పరిచారని, వేమన ఒక తత్వవేత్త అని అన్నారు. వేమన పద్యాలు నేడు సైతం పాఠశాల విద్యార్థులకు, యువతకు ఎంతో స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు. ముందుగా యోగి వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేమన గేయ పోటీలు నిర్వహించగా అందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సీతరామిరెడ్డి, ఎంపీటీసీ కె.కోటేశ్వరరావు, స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ పందిటి సుధాకర్ రెడ్డి, తియ్యగుర వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసక్తిగా పశు బలప్రదర్శన పోటీలు



ప్రథమ బహుమతి పొందిన ఎడ్ల యజమానికి ప్రైజ్‌మనీ అందజేస్తున్న దృశ్యం

దుర్గి: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల పురస్కరించుకొని మండల కేంద్రం దుర్గిలో రెండవ రోజు పశుబల ప్రదర్శన పోటీలు ఆసక్తిగా కొనసాగాయి. గురువారం స్థానిక జిల్లా పరిషత్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి పశు బల ప్రదర్శనలో రెండు పళ్ల విభాగానికి చెందిన ఎడ్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన పిల్లిగడ్డ బాల సైదా ఎడ్లు 3600 అడుగుల దూరాన్ని 10 నిమిషాల్లో లాగి కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా ప్రతిపాడు మండలం గణికపూడి గ్రామానికి చందన కల్లూరి ప్రవీణ్ కుమార్ ఎడ్ల జత 3300 అడుగుల దూరాన్ని లాగి ద్వితీయ స్థానాన్ని పొందాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం చిన్న కొండ్రుపాడు గ్రామానికి చెందిన కండె హనుమంతరావు ఎడ్లు 3026 అడుగుల దూరాన్ని లాగి మూడోస్థానంలో కొనసాగాయి. బాపట్ల జిల్లా మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామానికి చెందిన తోట సుబ్బారావు ఎడ్ల జత నాలుగో స్థానాన్ని, పల్నాడు జిల్లా మాచవరం మండలం, రుక్మిణి పురం గ్రామానికి చెందిన యామర్తి వెంకటేశ్వర్లు యాదవ్ ఎడ్ల జత ఐదో స్థానం పొందాయి. ఆయా విభాగాలకు చెందిన ఎడ్ల జతలకు దాతలు పశు యజమానులకు ప్రైజ్ మనీ అందజేసి శాలువతో సత్కరించారు. నిర్వాహక కమిటీ సభ్యులు కటకం చిన వెంకటయ్య, కటకం రామారావు, గందె గోపాల్‌రావు, కటకం గోపాల్, పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు జక్కా రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన రైతులు, పశుపోషకులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



పిన్నెల్లిలో బాలుడిని పరామర్శిస్తున్న వైద్యాధికారులు

మాచవరం: విష జ్వరాలైన మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జ్వర లక్షణాలు ఉంటే తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా మలేరియా అధికారి రవి రత్నాకర్ అన్నారు. మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. అనంతరం మండలంలోని పిన్నెల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో అనుమానిత డెంగీ జ్వర లక్షణాలు ఉన్న బాలుడిని పరామర్శించారు. గత వారం రోజుల క్రితం జ్వరంతో బాధపడుతున్న దండు అరుణ్‌కుమార్ అనే బాలుడికి డెంగీ జ్వర లక్షణాలు గుర్తించి, ముందస్తుగా అనుమానిత కేసుగా నమోదు చేసి గుంటూరు జీజీహెచ్‌లో వైద్య చికిత్స చేయించారు. చికిత్స అనంతరం స్వగ్రామానికి తీసుకురాగా పీహెచ్‌సీ అధికారులతో కలిసి బాలుడి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. బాలుడు ఆరోగ్యంగా ఉన్నాడని, ఇప్పటికే కాలనీలో వ్యాధి నివారణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యధికారి ఎస్ఎస్ చక్రవర్తి, విస్తరణాధికారి పట్టాభి, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభాకర్, స్థానిక ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఉన్నారు.

నూరు శాతం పన్ను వసూలు చేయాలి

డీఎల్‌పీఓ జయకృష్ణ



కార్యదర్శి రవీంద్రకు సూచనలు చేస్తున్న డీఎల్‌పీఓ జయకృష్ణ

శావల్యాపురం: గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు వసూలు నూరుశాతం అయ్యేలా క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలని నరసరావుపేట డివిజన్ డీఎల్‌పీవో చావా జయకృష్ణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటి పన్నులు వసూలపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎల్‌పీవో జయకృష్ణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు సహకారంతో వలంటీర్లు ద్వారా ఇంటి పన్నులు వసూలు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో రూ.25 కోట్లు బకాయి ఉందని అందులో శావల్యాపురం మండలంలో రూ.39 లక్షల ఉండగా, జిల్లాలో 28 మండలాలు ఉండగా 27వ స్థానంలో శావల్యాపురం మండలం ఉందన్నారు. ఇంటి పన్నులు వసూలు నూరుశాతం అయ్యేలా పంచాయతీ కార్యదర్శులు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈనెల 25లోగా 40 శాతం వసూలు చేయాలన్నారు. ఇంటి పన్ను వసూలు చేయటంలో విస్తృతస్థాయిలో గ్రామాల్లో దండోరా, మైకుల ద్వారా ప్రచారం నిర్వహించి ప్రజల్లో చైతన్యం పెంపొందించటంతో పాటు చెల్లింపులు వలన కలుగు ప్రయోజనాలు ప్రజలకు వివరించాలన్నారు. పగటి పూట వీధిలైట్లు వెలగకుండా సెన్సార్ విధానంలో వెలుగే లైట్లు పంచాయతీల్లో ఏర్పాటు చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహించిన పంచాయతీ కార్యదర్శులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పంచాయతీ వారిగా కార్యదర్శులు ద్వారా ఇంటి వసూలు చేయాల్సిన విధివిధానాలను వివరించి పురోగతి ఆరా తీశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఈవోపీఆర్‌డి పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

రైతుల శ్రేయస్సు కోసమే భూరక్ష పథకం



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎస్.సురేష్

నకరికల్లు: రీసర్వే సమర్థవంతంగా చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్ ఎస్.సురేష్ సూచించారు. మండలంలోని చీమలమర్రి గ్రామంలో రీ-సర్వే పనులను గురువారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు -భూరక్ష పథకం రైతుల శ్రేయస్సు కోసమేనని అన్నారు. రైతుల వెతలు తీర్చేందుకు ఈ పథకం తోడ్పడుతుందని అన్నారు. గ్రామంలోని ప్రతి ఎకరా రెవెన్యూ భూమిని గుర్తించి చేపడుతున్న రీసర్వే భవిష్యత్తులో భూసమస్యలు రాకుండా ఉండేందుకు దోహదపడుతుందని అన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన హక్కుపత్రాల జిరాక్స్‌లను సర్వే సిబ్బందికి అందజేయాలని సూచించారు. తద్వారా సర్వే త్వరితగతిన చేపట్టే అవకాశం ఉంటుందని అన్నారు. వీఆర్వో రమణారెడ్డి, సర్వేసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హిజ్రాల కిడ్నాప్, దాడి

● కేసు నమోదు చేసిన పోలీసులు

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న హిజ్రాలను తెలంగాణ నుంచి వచ్చిన హిజ్రాలు కిడ్నాప్ చేసి, దాడి చేయటంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ దాసరి శివనాగరాజు గురువారం తెలిపారు. దాచేపల్లిలోని చాపలగడ్డలో నివాసం ఉంటున్న సలీమా, జానీ బేగం అనే హిజ్రాలను తెలంగాణ నుంచి వచ్చిన ఏడుగురు హిజ్రాలు బుధవారం రాత్రి కిడ్నాప్ చేసి ఆటోలో మిర్యాలగూడెంకు తరలించారు. అక్కడ సలీమా, జానీబేగంపై దాడికి పాల్పడ్డారు. వారి చెర నుంచి సలీమా, జానీబేగం తప్పించుకుని దాచేపల్లికి వచ్చారు. సీఐ షేక్ బిలాలుద్దీన్‌ను కలిసి కిడ్నాప్, దాడిపై సలీమా ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ శివనాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో కిడ్నాప్, దాడి జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

మాచవరం: అక్రమంగా పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎస్.కోటయ్య తెలిపారు. వివరాల ప్రకారం మండల కేంద్రమైన మాచవరం ఎస్సీ కాలనీలో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీ చేపట్టగా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారివద్ద నుంచి రూ. 5350 నగదును స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితుడిపై అట్రాసిటీ కేసు నమోదు చేయండి



డీటీ వాణికి వినతి పత్రం అందజేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

మాచర్ల రూరల్: ఏడవ మైలు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఏసీపీఐ నాయకుడు అబ్రహం లింకన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వాణికి అర్జీ ఇచ్చి ఆయన మాట్లాడారు. గత ఏడాది అక్టోబర్‌లో ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న బాలిక పై అత్యాచారానికి పాల్పడిన శ్రీనివాసరావు పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటివి మరోమారు జరగకుండా అట్రాసిటి కేసు నమోదు చేసి అతని కుల ధ్రువీకరణపై విచారణ జరిపించాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఓర్సు కృష్ణ, నాయకులు బండ్ల మహేష్, సంపూర్ణ, కోటేశ్వరమ్మ, అన్నమ్మలు ఉన్నారు.

ముగ్గుల పోటీలో గ్రామీణ మహిళ ప్రతిభ



వినుకొండ (నూజెండ్ల): అవకాశాలు కల్పిస్తే ప్రతిభకు కొదవ లేదని గ్రామీణ మహిళ నిరూపించింది. ఇటీవల సంక్రాంతి పర్వదినాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. అందులో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సరావుపేటలో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలల్లో నూజెండ్ల మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళ నాగండ్ల గోవిందమ్మ తన ప్రతిభను కనపరచి జిల్లా స్థాయిలో కన్సోలేషన్ బహుమతి అందుకుంది. జిల్లావ్యాప్తంగా వందలాది మంది మహిళలు పాల్గొన్న ఈ పోటీల్లో ప్రతిభ కనపరచిన ఆమెను జిల్లా ఉన్నతాధికారులు నగదు బహుమతి, షీల్డుతోపాటు శాలువాతో ఘనంగా సత్కరించారు. గ్రామీణ ప్రాంతాలల్లో కూడా ప్రతిభకు కొరవ లేదని నిరూపించింది. ప్రభుత్వం ప్రోత్సాహం వల్లే తనకు గర్తింపు వచ్చిందని ఆమె తెలిపింది. దీంతో పలువురు అధికారులు ఆమెను అభినందించారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్ పరిశీలన



ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

గురజాల: ఆధార్ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీఓ గబ్రూనాయక్ తెలిపారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో ఆధార్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ ఆధార్ కార్డులో తప్పులు సరిదిద్దుకునేందుకు ఈకేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఆధార్‌లో తప్పులు ఉన్న వారు ఈ కేంద్రాల్లో మార్చుకునే అవకాశం కల్పించడం జరిగిందని వారం రోజులు పాటు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, నాయకులు కావూరి అంజిబాబు, సర్పంచి పేరుపోగు ముక్కంటి, గ్రామకార్యదర్శి శివ కోటేశ్వరరావు తదితరులున్నారు.

గురజాల: ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఫణికుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ 21వ తేదీన పులిపాడు-2 సచివాలయం నందు 23 పులిపాడు-1 సచివాలయం నందు ,24వ తేదీన తేలుకుట్ల గ్రామ సచివాలయంలో ఆధార్ స్పెషల్ కేంద్రాలను ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విధి నిర్వహణలో ఆలసత్వం తగదు



మాట్లాడుతున్న తహసీల్దార్ మీసాల దానియేలు

గురజాల: విధి నిర్వహణలో బీఎల్‌ఓలు ఆలసత్వం వహించవద్దని తహసీల్దార్ మీసాల దానియేలు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జనవరి 25వ తేదిన జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవం విజయవంతం చేయాలన్నారు. 80 సంవత్సరాలు పూర్తయిన వృద్ధులను సన్మానించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఓటు హక్కుపై బీఎల్‌ఓలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బీఎల్‌ఓలు విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నగర పంచాయతి కమిషనర్ అన్నదాత మోహన్ శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, బీఎల్ ఓలు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

సీఐ ఎం.మధుసూధన్‌రావు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఎం.మధుసూధన్‌రావు

పిడుగురాళ్ల: ప్రాణం విలువ తెలుసుకొని ప్రతి ఒక్కరు డ్రైవింగ్ చేయాలని పట్టణ సీఐ ఎం.మధుసూధన్‌రావు అన్నారు. పట్టణం పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే తరాలు మన మీద ఎంత ఆశపడి ఉన్నారో గుర్తించి డ్రైవింగ్ చేయాలన్నారు. అతివేగం ప్రమాదానికి దారితీస్తుందని, అతివేగంగా డ్రైవింగ్ చేయరాదని ఆయన సూచించారు. రోడ్డు వెంట ఆటోలను ఆపి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించవద్దన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు, ఎస్ఐ పవన్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రెండు బస్సులు ఢీకొని ఇద్దరికి గాయాలు

● నలుగురికి స్వల్ప గాయాలు



గాయపడి చికిత్స పొందుతున్న టీఎస్ ఆర్టీసీ బస్సు డ్రైవర్ బోలేకర్ దేవేంద్ర

పిడుగురాళ్లరూరల్: రెండు బస్సులు ఢీకొని ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన మండలంలోని తుమ్మలచెరువు, వీరాపురం గ్రామాల మధ్య గురు వారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పిడుగురాళ్ల పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఒంగోలు వెళ్తున్న కావేరి ట్రావెల్స్ బస్సులో ఒక్కసారిగా మంటలు రావటంతో బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దాంతో వెనుకనే వస్తున్న హైదరాబాద్ నుంచి గుంటూరు వెళ్తున్న టీఎస్ ఆర్టీసీ బస్సు కావేరి ట్రావెల్ బస్సును ఢీకొంది. ఘటన జరిగిన సమయంలో ఆర్టీసీ బస్సులో డ్రైవర్ బోలేకర్ దేవేంద్ర, ఇద్దరు ప్రయాణికులు మాత్రమే ఉండగా, డ్రైవర్ బోలేకర్ దేవేంద్ర గాయపడ్డాడు. మిగిలిన వారికి ఎలాంటి గాయాలు కాలేదు. అదేవిధంగా కావేరి ట్రావెల్స్ బస్సులో ఝాన్సీ అనే ప్రయాణికురాలు తీవ్రంగా, నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. ఝాన్సీని, టీఎస్ ఆర్టీసీ డ్రైవర్ బోలేకర్ దేవేంద్రను పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించించారు. టీఎస్ ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు లేకపోవటం వలన పెద్ద ప్రమాదం తప్పిందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధుసుధనరావు తెలిపారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిత్తు



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

సత్తెనపల్లి: చదువు మరో తరానికి మార్పు తెస్తుందని, లక్ష్యం కోసం విద్యార్థి దశ నుంచే పాటు పడాలని మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర గుంటూరు వారి సౌజన్యంతో, హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేటి యువత మాదకద్రవ్యాల పాత్ర అనే అంశంపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర రావు అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి యువత జీవితాలను మాదక ద్రవ్యాలు చిత్తు చేస్తున్నాయని, ఈ మాదకద్రవ్యాల పోకడ కాలేజీలు, పాఠశాలల, విద్యార్థులను సైతం నాశనం చేస్తుందని, సరదాగా ప్రారంభమయ్యే ఈ అలవాటు కొన్నాళ్లకు బానిసగా మారుస్తుందన్నారు. ఆత్మీయ అతిథిగా హాజరైన దంత వైద్యుడు బాజీ బాబు మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయన్నారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, ప్రతాపు బాబు సురేష్, సోమశేఖర్, చంద్ర శేఖర్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన

బొల్లవరం(ముప్పాళ్ళ): వ్యవసాయాన్ని తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందే మార్గాలపై రైతులు దృష్టి సారించాలని దళిత బహుజన రీసోర్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ మేడే వెంకటరమణ చెప్పారు. మండలంలోని బొల్లవరం గ్రామంలో డీబీఆర్సీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై ఎస్సీ, ఎస్టీ రైతులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. సాగులో సేంద్రీయ పద్ధతులు అవలంభిస్తూ కషాయాలు తయారు చేసుకుంటే సాగు వ్యయం తగ్గుతుందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పాటైతే ఉత్పత్తిదారుల సంఘం వలన సబ్సిడీ రూపంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యంత్రపరికరాలు పొందవచ్చన్నారు. నాబార్డు సంస్థ నుంచి బ్యాంక్‌రుణం ద్వారా వరికోత మిషన్లు, ట్రాక్టర్లు పొందవచ్చన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రంగయ్య, శ్రీనివాసరావు, కౌలురైతులు పాల్గొన్నారు.